





సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన మంత్రి హరీశ్‌రావు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు

# అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

- సంగారెడ్డి వరకు మెట్రోరైలు...
- ఐటీ హబ్‌గా సంగారెడ్డి జిల్లాకేంద్రం
- సంగమేశ్వరతో సేద్యం సస్యశామలం
- మీరే నా బలం... నా బలగం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సంగారెడ్డి, నవంబర్ 27 : సంగారెడ్డి జిల్లా కేంద్రం ప్రజలు ఎదురుచూస్తున్న మెట్రోరైలు సౌకర్యం రెండు దశల్లో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయగానే చుక్..చుక్ రైలుకు శ్రీకారం చుట్టనున్నారని బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బీఆర్‌ఎస్ ప్రజాఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరై ప్రజలకు త్వరలో ఏర్పడే ప్రభుత్వంలో అమలు చేసే పథకాలను ప్రకటించారు.

ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. నేను మీ ముందు నిలబడడానికి కారణం సీఎం కేసీఆర్ అని, తనకు మరోసారి అభ్యర్థిగా అవకాశం ఇవ్వడం తన అదృష్టమన్నారు. 2018 ఎన్నికల్లో తాను ఓడిపోయినా ప్రజా సేవలో ఉన్నానని, కరోనా కష్టకాలంలో బాధితులకు అవసరమైన మందులు, నిత్యావసరాలు అందజేసి ఆదుకున్నామన్నారు. గత ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సంగారెడ్డిలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రకటించారని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఏడాదిలోపే సంగారెడ్డి ప్రజలకు మెడికల్ విద్య అందించిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. మెడికల్ కళాశాలతోపాటు నర్సింగ్ కళాశాల, పారామెడికల్ కళాశాలను మంజూరు చేశారని, కళాశాలల భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మొదటి సంవత్సరం మెడికల్ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు రెండో సంవత్సరం నాటికి భవనాల నిర్మాణం పూర్తి కావచ్చిందన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని రైతాంగానికి రెండు పంటలకు నీళ్లు అందించేందుకు సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్‌తో సస్యశ్యామలం కానున్నదని గుర్తు చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తానని తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని ప్రజలను ఆయన అభ్యర్థించారు.

**మీరే నా బలం..బలగం...**

ప్రజలకు అందుబాటులో ఉండి సేవకుడిలా పని చేసేందుకు తాను నిరంతరం శ్రమిస్తానని, మీరే నా బలం.. నా బలగం అనుకుని ముందుకు సాగుతానని చింతా ప్రభాకర్ అన్నారు. తాను ముఖ్యమంత్రి దృష్టికి మొదటి విడతలో మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు పొడిగించిన మెట్రోరైలును రెండో దశలో ఇస్నాపూర్ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు పొడిగించాలని కోరారని. జిల్లా కేంద్రంలో ఐటీహబ్ ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వచ్చి ఉపాధి దొరుకుతుందని, అసలు నిరుద్యోగమే లేకుండా పోతుందని సీఎంకు వివరించానని తెలిపారు. నియోజవర్గ అభివృద్ధికి ప్రజలు తోడుంటే తనను గెలిపించి ఎమ్మెల్యేగా చేస్తే నిలిచిపోయిన పనులన్నీ సీఎం కృషితో అమలు చేస్తానని చింతా ప్రభాకర్ భరోసా ఇచ్చారు.



ప్రజా ఆశీర్వాద సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, పక్కన బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

## కదిలిన గులాబీదండు

- ఊరువాడా నుంచి సంగారెడ్డికి పయనం

కొండాపూర్/సదాశివపేట, నవంబర్ 27 : ముఖ్యమంత్రి కేసీఆర్ సంగారెడ్డిలో సోమవారం నిర్వహించిన సంగారెడ్డి నియోజకవర్గ ప్రజా ఆశీర్వాదసభకు కొండాపూర్ మండలంలోని 24 గ్రామపంచాయతీలు, మధిర గ్రామాలు, సదాశివపేట మున్సిపాలిటీలోని 26 వార్డులు, మండలంలోని 30 గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కొండాపూర్, సదాశివపేట మండలాల నుంచి వచ్చిన నాయకులు చిందులేస్తూ సభాస్థలికి చేరుకున్నారు. సీఎం కేసీఆర్ జిందాబాద్, చింతా ప్రభాకర్ నాయకత్వం వర్ధిల్లాలి అనే నినాదాలతో సంగారెడ్డి పట్టణం దద్దరిల్లింది. ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణం మొత్తం గులాబీమయంతో కళకళలాడింది. ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన ముచ్చట్లను ప్రజలు శ్రద్ధగా విని కారు గుర్తుకు ఓటేస్తే అభివృద్ధి ఆపడం ఎవరి తరం కాదనే విషయాన్ని తెలుసుకున్నారు. గతంలో స్వల్ప ఓట్లతో ఓటమి చెందిన చింతా ప్రభాకర్ ఓడిపోయినా ప్రజల్లోనే ఉండి సమస్యలు పరిష్కరించారని ప్రజలు ముచ్చటించుకున్నారు. సభకు వెళ్లిన వారిలో లో కొండాపూర్, సదాశివపేట పట్టణ, మండలానికి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంగారెడ్డి ప్రజా ఆశీర్వాదసభకు హాజరైన ప్రజలు



# పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 27 : ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్‌కు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ముఖ్య ఎన్నికల అధికారులు రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ పాల్గొన్నారు. శాసన సభ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ పలు సూచనలు చేశారు. వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

**అనుమతి లేకుండా ప్రకటనలు ప్రచురించొద్దు**

**★ బల్క్ ఎస్‌ఎంఎస్‌లు ప్రసారం చేయరాదు**

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికెషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా ఈ నెల 29, 30 తేదీల్లో ప్రింట్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురించొద్దని జిల్లా ఎన్నికల అధికారి శరత్ ఆదేశించారు. వివిధ రాజకీయ అభ్యర్థులు, ఎవరైనా ఎంసీఎంసీలో అనుమతి కోసం దరఖాస్తు చేసుకొని ధ్రువీకరణ పొందాలన్నారు. 29, 30 తేదీల్లో ఎన్నికల ప్రకటనలు ఇచ్చేవారు ఎంసీఎంసీలో అనుమతి తీసుకోవాలన్నారు. ఆవేశపూరిత, ద్వేషపూరిత, తప్పుదోవ పట్టించే ప్రకటనలకు అనుమతి ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 నుంచి 30వ తేదీ సాయంత్రం 5గంటలకు ఎలాంటి బల్క్ ఎస్‌ఎంఎస్‌లు ప్రసారం చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# చెరువులో మునిగి ఇద్దరు మృతి

కోహీర్, నవంబర్ 27 : ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఇద్దరు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మోహన్(32), అంజయ్య(30) ఇద్దరు కలిసి ఆదివారం ఉదయం ఆటోలో వికారాబాద్ మర్పల్లికి వెళ్లారు. పైడిగుమ్మాల్ గ్రామానికి రాత్రి 10 గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణమయ్యారు. గ్రామ శివారులోని మైసమ్మ చెరువు పక్కన ఆటోను నిలిపారు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయారు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగారు. సోమవారం ఉదయం అయినా ఇంటికి చేరుకోలేరు. చెరువు వద్ద నిలిపి ఉన్న ఆటోను స్థానిక రైతులు గమనించారు. అక్కడే పాదరక్షలు కనిపించడంతో చెరువులో మునిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా, ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. మృతుల తండ్రులు రామయ్య, ఏసయ్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.